క్లుప్తంగా

14 నుంచి నాటక పోటీలు

గూడూరు: సంస్కృతి సమ్మేళనం సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు నాటక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ నాటక విభాగం కన్వీనర్ జానా శివయ్య పేర్కొన్నారు. డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 70 ఏళ్లుగా సంస్కృతి సమ్మేళనం ఆధ్వర్యంలో నాటక పోటీలు నిర్వహించడం తెలిసిందేనన్నారు. ఈ క్రమంలో డీఎస్‌ఆర్ ఓపెన్ ఆడిటోరియంలో 14వ తేదీ నుంచి సందేశాత్మక, హాస్యభరిత, నవరసభరితమైన నాటక ప్రదర్శనలు జరుగుతాయని చెప్పారు. ఈ సమావేశంలో కట్టా మురళీకృష్ణ, చెంచురామయ్య, మునిగిరీష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తక్షణం పరిష్కరించాలి



కొత్తపాళెంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

కోట: సమస్యలను తక్షణం పరిష్కరించాలని డివిజన్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) వాణి అన్నారు. సోమవారం ఆమె మండలంలోని కొత్తపాళెం, గూడలి, వెంకన్నపాళెం సచివాలయాలను సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సచివాలయాలకు వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారుల వివరాలతో జాబితాను ప్రతి సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భవానీ పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు త్వరగా పూర్తి చేయండి



పనులను పరిశీలిస్తున్నఎంపీడీఓ

సైదాపురం: మండలంలోని గిద్దలూరు, ఊటుకూరు ఉన్నత పాఠశాలల్లో నాడు–నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సూచించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. నాడు–నేడు పనులు నాణ్యతగా చేయాలన్నారు. జూన్ మొదటి వారం లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ దయాల్, ఎంఈఓ దయాకర్ ఉన్నారు.

క్రికెట్ శిక్షణకు పేర్లు నమోదు చేసుకోవాలి

గూడూరు: సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్‌లో శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి గల పిల్లలు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్ సభ్యుడు కే మునిగిరీష్ పేర్కొన్నారు. స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా గూడూరు క్రికెట్ క్లబ్, అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్, కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల పదిహేనేళ్లలోపు పిల్లలు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సురేంద్రరెడ్డి, లవకుమార్, విజయ్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.

చింత చెట్టుపై పిడుగు

కలువాయి: మండలంలోని చీపినాపి ఎస్టీ కాలనీలో ఉన్న చింత చెట్టుపై ఆదివారం రాత్రి పిడుగు పడింది. దీంతో చెట్టుకు మంటలు వ్యాపించాయి. గ్రామంలో ఆదివారం రాత్రి ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఆ సమయంలో చెట్టుపై పిడుగు పడి మంటలు అలుముకున్నాయి. దీంతో కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. ఆసమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం వరకు చెట్టు కాలుతుండడంతో అగ్నిమాపకశాఖ సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

గూడూరు: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న పాలిసెట్‌కు పట్టణంలో 8 కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్ రవికృష్ణ తెలిపారు. ఈ నెల 10వ తేదీ బుధవారం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, సిరామిక్ కళాశాల, ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాల, జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, డీఆర్‌డబ్ల్యూ కళాశాల, ఆదిశంకర పాలిటెక్నిక్ కళాశాల, ఆదిశంకర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటెక్నిక్ కాలేజీలో పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ ఎంట్రన్స్ టెస్ట్‌కు విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావాలన్నారు. అలాగే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు బ్లాక్ ఇంక్ బాల్ పాయింట్ పెన్, హెచ్‌బీ కానీ, టూబీ పెన్సిల్, ఎరాజర్‌తో రావాలన్నారు. ఉదయం పది గంటలకే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. 11 గంటల తర్వాత కేంద్రంలోనికి విద్యార్థులను అనుమతించరని తెలిపారు.

పేదల అభ్యున్నతికే భూ పంపిణీ



ఆర్డీఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: పేదల అభ్యున్నతి కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పానకా దేవసేనమ్మతో కలసి పలు విషయాలపై ఆర్డీఓతో సోమవారం సమావేశమై, చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఇప్పటివరకు పేదలు సాగు చేసుకుంటున్న భూములను వారికే అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం దేవసేనమ్మ మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ మేరకు ఈ నెల 12వ తేదీన కావలిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూ పంపిణీ చేస్తారని తెలిపారు. ఇలా పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మళ్లీ ఆదరించి, సీఎంను చేయాలని కోరారు.

ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్లు

పల్లెల నుంచి వచ్చిన ప్రయాణికులతోపాటు, పేద ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద నిర్మించి మరుగుదొడ్లను సోమవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పానకా దేశసేనమ్మతో కలసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అదే ప్రాంతంలో సులభ్ కాంప్లెక్స్ ఉన్నప్పటికీ, అవి అపరిశుభ్రంగా ఉన్నాయని, అలాగే నగదు కూడా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ క్రమంలోనే పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉచిత మరుగుదొడ్లను నిర్మించామన్నారు. దేవసేనమ్మ మాట్లాడుతూ మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆయన వెంట ఆర్డీఓ కిరణ్‌కుమార్, కమిషనర్ సాయినాథ్ తదితరులున్నారు.

పట్టాలు ఇవ్వండి



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్

చిల్లకూరు: తమ గ్రామంలోని పేదలకు భూ పట్టాలు ఇవ్వాలని వేళ్లపాళెం సర్పంచ్ వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన స్పందన కార్యక్రమంలో పాల్గొని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్‌కు గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా వేళ్లపాళెం గ్రామానికి చెందిన పేదలు సర్పంచ్‌తో కలసి వచ్చి అర్జీలు ఇచ్చి, తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ తొలి విడత భూ పంపిణీ జాబితాను ఇప్పటికే ప్రభుత్వానికి పంపామని, రెండో జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపేలా చూస్తామని తెలిపారు.

కామిరెడ్డి పరామర్శ

పెళ్లకూరు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బైనా చంద్రశేఖర్‌రెడ్డిని సోమవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, స్థానిక ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా పరామర్శించారు. నాయకులు బైనా మల్లికార్జునరెడ్డి, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రఘునాయుడు, నల్లారి ప్రకాశం, పేట చంద్రారెడ్డి, పేర్నాటి రాహుల్, రమేష్‌నాయుడు, మురళీకృష్ణారెడ్డి, హరిరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



ఆరూరు చెరువు వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక బోర్డు

చిట్టమూరు: మండలంలో ప్రమాదకరంగా ఉన్న చెరువులు, గుంతల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మీభవానీ సోమవారం తెలిపారు. వేసవి కావడంతో విద్యార్థులు సెలవులకు సొంత ఊరికి చేరుకుని సరదాగా చెరువుల్లో, గుంతల్లోకి ఈతకు వెలుతుంటారన్నారు. అయితే ఈ గుంతల్లో లోతు తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని 15 గ్రామ సచివాలయ పరిధిలోని చెరువులు, గుంతల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఈతకు వెళ్లకుండా చూడాలని కోరారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులు, మహిళలు అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అన్ని వర్గాలకు ఆ ఫలాలు నేరుగా అందిస్తున్నారని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు రైతులు కలిసి రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే, ఉమ్మడి బ్యాంక్ ఖాతా ప్రారంభించి, రుణం పొందే అవకాశం ఉందన్నారు. మండలంలో వంద గ్రూపులు ఏర్పడితే, మండల స్థాయి ఉత్పత్తిదారుల సమాఖ్యను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో ఒక్కో గ్రూపునకు యాక్టివిటీ ఫండ్ రూ.1.50 లక్షలు రుణం అందించే అవకాశం ఉందన్నారు. అలాగే వ్యవసాయ పనిముట్లు, విత్తనాలకు రూ.1.50 లక్షలు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏరియా కోఆర్డినేటర్ మురళి, ఏపీఎం మునిరాజయ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అంకమ్మ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి



విద్యార్థులను సత్కరిస్తున్న తహసీల్దార్, సీఐ

చిల్లకూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలని గూడూరు రూరల్ సీఐ దశరథరామారావు ఆకాంక్షించారు. మండలంలో పది పరీక్షల్లో మండలస్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ ఆధ్వర్యంలో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయులు కీలకంగా వ్యవహరించారన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ తమ్మినపట్నంలోని మత్స్యకార కాలనీకి చెందిన మానస ప్రథమ స్థానం, చిల్లకూరు గురుకుల పాఠశాలకు చెందిన ఎం రేవంత్ , కడివేడుకు చెందిన పీ బాలాజీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపారని, వీరిని స్ఫూర్తిగా తీసుకుని, విద్యార్థులు ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య, ఎంపీటీసీ సభ్యులు దారా కోటేశ్వరరావు, ఎల్లసిరి జానకిరామ్, ఆర్‌ఐ రమ్యస్వాతి, పోతుగుంట మల్లికార్జున, రావుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



రాపూరులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

రాపూరు: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని గ్రంథాలయాధికారి ధనమ్మ పేర్కొన్నారు. రాపూరు గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 35 రోజుల పాటు ఈ వేసవి విజ్ఞాన కేంద్రాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ

కలువాయి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని గ్రంథాలయంలో సోమవారం నాలుగు రోజుల వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్ర లేఖనం, వ్యాసరచన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జనార్దన్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం రాంబాబు, లైబ్రేరియన్లు కృష్ణజ్యోతి, శశిబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



చిల్లకూరు: విద్యార్థులను అభినందిస్తున్న మాధవి



పిగిలాంలో చిన్నారులను అభినందిస్తున్న టీచర్లు



తడ: జననిని అభినందిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

చిల్లకూరు: చింతవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆరుగురు విద్యార్థులను సోమవారం ఎంపీటీసీ సభ్యురాలు పాలూరు మాధవి అభినందించారు. మాధవి మాట్లాడుతూ తీర గ్రామాల్లోని విద్యార్థులను ప్రోత్సహించేలా ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. పదిలో రాణించిన ఎం శిరీషా, వంశీ, మేఘన, శ్రావణి, సుజన, దేవసేన భవిష్యత్తులో కూడా మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారావు, నక్కా పాల్ సురేంద్ర, సీఆర్పీ పాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలయాపల్లిలో..

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. మండల ఫస్ట్ వచ్చిన ప్రమోద్, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన శ్రీనాథ్, స్ఫూర్తిని సోమవారం బాలాయపల్లి మండలం పిగిలాం జెడ్పీ ఉన్నతపాఠశాలలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అభినందించి, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినికి అభినందన

తడ: పది పరీక్ష ఫలితాల్లో తిరుపతి జిల్లా స్థాయిలో మూడో స్థానం సాధించిన చిన్న మాంబట్టు ఉన్నత పాఠశాల విద్యార్థిని కొల్లి జననిని ఎంఈఓ ఇందిర, పాఠశాల హెచ్‌ఎం ఫణివేణి సోమవారం అభినందించారు. వారు ఎస్‌ఎం కండ్రిగలోని విద్యార్థిని ఇంటికి వెళ్లి, పుష్పగుచ్ఛం ఇచ్చి, అభినందించి, ఆశీర్వదించారు. అలాగే పీసీ చైర్మన్ కామిరెడ్డి నారాయణరెడ్డి జననిని అభినందించారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



నగదు అందజేస్తున్న నాయకులు

వెంకటగిరి: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కె సతీష్‌కుమార్, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు ఇటీవల మరణించిన బెన్నీ భార్య సాయిరేఖకు వైఎస్సార్ బీమా నగదు పంపిణీ చేశారు. పట్టణంలోని 20వ వార్డుకు చెందిన డి శ్రీనాథ్(బెన్ని) మృతి చెందడంతో వైఎస్సార్ బీమా పథకంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని బాధితురాలికి అందజేశారు.

బైబిల్ శిక్షణ ప్రారంభం

చిల్లకూరు: మండలంలోని కమ్మవారిపాళెంలో ఉన్న లోగోస్ లూథరన్ చర్చిలో సంఘ కాపరి రెవరెండ్ బీ. విజయకుమార్ వేసవి బైబిల్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు, మహిళా సమాజ సభ్యులు, వేసవి బైబిల్ శిక్షణ బోధకులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం



చండీహోమంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

రాపూరు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం చండీ హోమం, మహాకుంభాభిషేకం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొలు మధుసూదన్‌రావు, అర్చకులు రామనాథేశ్వరశర్మ, ఆర్యవైశ్య దంపతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

గూడూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన బలిజ విద్యార్థులకు బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు ఆ సంఘం నాయకులు సారంగం శ్రీనివాసులు తెలిపారు. త్యాగరాజవీధిలోని ఓ పంక్షన్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి ఉత్తీర్ణులైన బలిజ విద్యార్థులకు, బలిజ నాయకులు చదలవాడ హరిప్రసాద్ దాతృత్వంతో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని, ఈ మేరకు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న సునీతా సేవా సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో రమణయ్య, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

గడప గడపలో జగనన్న సంక్షేమమే



లబ్ధిదారుడికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్: గడప గడపలో జగనన్న సంక్షేమమే కనిపిస్తుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేట మండలంలోన కోటపోలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. మళ్లీ జగనన్న ఆశీర్వదించాలని కోరారు. సుమారు 250 ఇళ్లను సందర్శించి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. బుక్‌లెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదల కోసం పలు పథకాలు ప్రవేశపెట్టి, వాటిని కచ్చితంగా అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, వైస్సార్‌సీపీ నాయకులు జెట్టి వేణు, బద్దెపూడి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

టీసీఆర్‌కు ఎమ్మెల్యే కిలివేటి పరామర్శ

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు బైనా చంద్రశేఖర్‌రెడ్డిని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం పరామర్శించారు. చంద్రశేఖర్‌రెడ్డి తల్లి బుజ్జమ్మ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నాయుడుపేట పట్టణ అధ్యక్షుడు కటకం జయరామయ్య ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఓజిలి: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ముమ్మడి సుబ్బయ్యను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం పరామర్శించారు. సుబ్బయ్య కుమార్తె రజిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ గ్రామానికి వెళ్లి రజిత మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట జేసీఎస్ కన్వీనర్ షేక్ ఖాదర్ బాషా, నాయకులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పాదర్తి హరనాథ్‌రెడ్డి, వీరయ్య, రంగయ్య తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..



కలువాయి: చీపినాపిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కలువాయి: సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. కలువాయి మండలం చీపినాపిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, ఉపాధ్యక్షులు పంగా పెంచల నరసారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు చల్లా రఘురామిరెడ్డి, నాయకులు మేకపాటి వెంకటనరసారెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి సముచిత స్థానం

వాకాడు: పార్టీలో కష్టపడిన వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ సీనియర్ నాయకుడు బత్తిన విజయకుమార్‌తోపాటు పలువురు నాయకులు వాకాడులో రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, పీ రాజశేఖర్‌రెడ్డి, ఎన్ మధురెడ్డి, వెంకటరత్నం, పి కృష్ణారెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, జీ సుధాకర్‌రెడ్డి, పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌రెడ్డికి మా తండ్రితో ఎంతో అనుబంధం

గూడూరు: ప్రముఖ సీనియర్ వైద్యుడు సీఆర్‌రెడ్డితో తన తండ్రి మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డికి ఎంతో అనుబంధం ఉందని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం సీఆర్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రోహిణి, అల్లుడు డాక్టర్ జనార్దన్‌రెడ్డిని రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించి, సీఆర్ రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, జీ శ్రీనివాసులురెడ్డి, చింతంరెడ్డి కృష్ణారెడ్డి తదితరులున్నారు.